క్లుప్తంగా

నవోదయలో సీటు సాధించటం హర్షణీయం



నాదెండ్ల: జవహర్ నవోదయలో విద్యార్థి సీటు సాధించటం హర్షణీయమని ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి చెప్పారు. గణపవరం అంబేద్కర్ కాలనీలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి కొండెపాగ అకిరా నందన్ మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయలో ఆరో తరగతి ప్రవేశపరీక్షలో సత్తా చాటి సీటు సాధించాడు. గురువారం విద్యార్థి అకిరా నందన్, తండ్రి నాగేశ్వరరావును ఎంఈవోతో కలిసి ఉపాధ్యాయులు శాలువాలతో అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆలోకం మారుతీరావు, ఉపాధ్యాయులు జయపాల్, అరుణకుమారి, రజినీకుమారి పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకోవడం అభినందనీయం

చిలకలూరిపేట: రంజాన్ పండుగను పురస్కరించుకొని నిరుపేదలను ఆదుకోవడం అభినందనీయమని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. పఠాన్ చిన సత్తార్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని గురువారం 16 వందల మంది నిరుపేద కుటుంబాల వారికి 15 రకాల నిత్యావసరాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా తండ్రి జ్ఞాపకార్థం ఆయన కుమారులు సేవా కార్యక్రమాలు నిర్వహించటం ఆదర్శనీయమన్నారు. రంజాన్ సమయంలో పేదలకు నిత్యావసరాలు అందజేయడం, పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ చేయాడాన్ని అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ పఠాన్ యూసుఫ్‌ఖాన్, ఆరాధ్యుల రామకృష్ణ, పఠాన్ యాసిన్, పఠాన్ నజీర్, మెరుగు జాని, సాదిక్, రఫి, రహేమాన్ పాల్గొన్నారు.

నోటి పరిశుభ్రత పాటించాలి

చిలకలూరిపేట: నోటి సంబంధ వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరూ రోజుకు రెండుసార్లు బ్రెష్ చేసుకోవాలని, నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏరియా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి కుమారి చెప్పారు. ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో గురువారం ఓరల్ హెల్త్ డేని నిర్వహించారు. ముందుగా రోగులకు ఓరల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రిలో ఉన్న రోగులు, పారిశుద్ధ్య కార్మికులు, ఆశ వర్కర్లకు నోటి పరిశుభ్రతపై అవగాహన కల్పించటంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్యురాలు డాక్టర్ భాగ్యమ్మ మాట్లాడుతూ నోరు ఎంత ఆరోగ్యంగా ఉంటే మనం అంత ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఎక్కువ మొత్తంలో చక్కెర వినియోగం, పొగాకు నమ లడం, మద్యం సేవించటం, సరైన పరిశుభ్రత పాటించట పోవడంతో నోటి ఆరోగ్యం దెబ్బ తింటుందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో షబ్-యే- బారాత్ ప్రార్థనలు

చిలకలూరిపేట టౌన్ / యడ్లపాడు: పవిత్ర రంజాన్ మాసం సమీపిస్తుందని గుర్తు చేస్తూ మహిమాన్విత రాత్రిగా పేర్కొనే షబ్-ఏ-బరాత్ పర్వదినాన్ని గురువారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లాలోని పలు మసీదులకు విద్యుత్ దీపాలతో అలంకరణలు చేశారు. రాత్రి ఇషా నమాజ్ తర్వాత మతగురువులు షబ్-యే-బరాత్ పవిత్రత, రంజాన్ మాసం విశిష్టతలను వివరించారు. ప్రతి ఒక్కరూ మహా ప్రవక్త మార్గా న్ని అనుసరించాలని, అల్లాహ్ ఆరాధనలో గడుపుతూ రంజాన్ పర్వదినం వరకు ప్రతిక్షణాన్ని సద్వినియోగం చేసుకుని పుణ్య ఫలాలను పొందాలని సూచించారు. పవిత్ర రాత్రి సందర్భంగా మసీదుల్లో తెల్లవారుజాము వరకు నమాజ్, జికర్, పవిత్ర ఖురాన్ గ్రంథ పఠనంతో జాగరణ చేశారు. మహిళలు తమతమ గృహాల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక ప్రచార ర్యాలీ

నరసరావుపేట ఈస్ట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన దేశ వ్యాప్త నిరసన ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని చిత్రాలయ సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉప్పలపాటి రంగయ్య, సత్యనారాయణరాజు, పట్టణ షేక్. చినజాన్‌సైదా, హుస్సేన్, నాగేశ్వరరావు, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

రుణమేళాకు 95 మంది హాజరు

యడ్లపాడు: మండలం పరిషత్ కార్యాలయంలో గురువారం 2024-25 ఏడాదికి గానూ బీసీ, ఈబీసీ, ఓసీ, కాపు, జనరిక్ ఫార్మసీ రుణ అర్హత మేళా కార్యక్రమం నిర్వహించారు. ఆ యా వర్గాలకు చెందిన అభ్యర్థులు సబ్సిడీ రుణాలకోసం ఆన్‌లైన్ ద్వారా 215 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో బీసీ కేటగిరి కింద-125, ఈబీసీ-45, కాపు-45 అర్జీలు దాఖలు చేసుకోగా, గురువారం అధికారులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 95 మంది మాత్రమే హాజరయ్యారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి ఆయా కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై మూడు స్లాబ్‌లుగా రుణాలు మంజూరు చేయనున్నారు.

భవిష్యత్.. వీధి పాలేనా!

- అండర్‌పాస్ వంతెన కింద బండ్లు తీయాలని హైవే అధికారుల హుకుం
- పాపం చిరువ్యాపారులు
- ప్రత్యేక స్థలం కేటాయించాలంటూ వినతి



మంగళవారం తిరిగి బండ్లు పెట్టడంతో ప్రస్తుతం ఉన్న సరుకు అయిపోగానే అంతా ఖాళీ చేయాలని చెప్పి వెళ్తున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది

యడ్లపాడు: చిరువ్యాపారుల కుటుంబాలు వీధిన పడనున్నాయి. మండల కేంద్రమైన యడ్లపాడులోని హైవే వంతెన కింద ఏళ్లనాటి నుండి వీధి వ్యాపారులు తమ జీవనోపాధిని కొనసాగిస్తున్నారు. తోపుడుబండ్లు, గంపలు పెట్టుకుని పండ్లు, కూరగాయలు, సోడాబండ్లు, అరటికాయలు, సిగరెట్లు, బీడీలు విక్రయిస్తూ తమ జీవితాలను నెట్టుకొస్తున్నారు. గతంలో జాతీయ రహదారి పక్కన చిరువ్యాపారులు తమ తోపుడు బండ్లను పెట్టుకుని వ్యాపారాలు చేసుకునేవారు. అయితే హైవే ఆరు లైన్ల విస్తరణలో భాగంగా వీధుల వెంట ఉన్న వ్యాపారులను అధికారులు తొలగించారు.

ఏదీ హామీ?

అయితే, 'మీ వ్యాపారాలకు ప్రత్యేక స్థలం కేటాయిస్తాం' అని అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ కూడా ఇచ్చారు. సంవత్సరాలు గడిచినా ఆ హామీ నెరవేర్చలేదు. ఇక చేసేదేమి లేక, హైవే వంతెన కింద 15 కుటుంబాలు తోపుడుబండ్లు, గంపలు పెట్టుకొని వ్యాపారం చేసుకోవడం ప్రారంభించారు. ఇప్పుడు 'ట్రాఫిక్ ఇబ్బందిగా మారింది' అంటూ హైవే అధికారులు వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించారు.

ఎక్కడికెళ్లాలి?

ఒక్కసారిగా ఇప్పుడు జాగా ఖాళీ చేయమంటే, ఎవరి చోటులో తమ బండ్లు పెట్టుకోవాలంటూ వీధి వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా హైవే పెట్రోలింగ్ వాహన సిబ్బంది ఖాళీ చేయాలంటూ తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు వీధి వ్యాపారులకు తక్షణమే ప్రత్యేక స్థలం కేటాయించి వ్యాపారం చేసుకునే వెసులుబాటు కల్పించాలని వారు వేడుకుంటున్నారు.

వీధిన పడకుండా చూడాలి



తాతల కాలం నుంచి హైవే రోడ్డు పక్కనే కాయలు, పండ్లు అమ్ముకుంటూ జీవిస్తున్నాం. హైవే విస్తరణ అప్పుడు మా వ్యాపారాల్ని తీసేయాలని చెప్పారు. ఆ తర్వాత వంతెన నిర్మించాక అక్కడ పెట్టుకుని వీటిని అమ్ముకుంటూ జీవిస్తున్నాం. రెండు రోజుల నుంచి మమ్మల్ని ఇక్కడి నుంచి ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. మాకు ప్రత్యామ్నాయం చూపకుంటే మా కుటుంబాలు వీధిన పడతాయి.

–కోడిరెక్క వేణు, వ్యాపారి

ఏం చేయాలో పాలుపోవడం లేదు!



అయ్యా నాకు 63 ఏళ్లు. 25 ఏళ్లుగా సోడాబండి పెట్టుకుని కుటుంబాన్ని నెట్టుకువస్తున్నా. గతంలో కిందపడి కాలు తొంటి, డిస్క్‌లో బాల్ వేసినందున మరో పని చేసే అవకాశం లేదు. ఎవరికీ ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వ్యాపారులంతా కలిసి ఉంటున్నాం. రోడ్ల పక్కన ఎక్కడా ఖాళీ లేదు. ఎక్కడో దూరంగా బండి పెట్టుకుంటే సోడాకోసం అంతదూరం రారుకదయ్యా. అధికారులు మా ఇబ్బందుల్ని గుర్తించి మా జీవనాధరం పోకుండా చూడాలని వేడుకుంటున్నాం.

–యల్లమంద వీరాంజనేయులు, సోడాబండి

స్నేహానికి ప్రాణమిచ్చేది ముస్లిం సోదరులే

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



ఇఫ్తార్ కార్యక్రమంలో డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: స్నేహానికి ప్రాణమిచ్చే కులం ఏదైనా ఉన్నదంటే అది ముస్లిం కులమేనని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని గురువారం సతామీ పర్వదినం సందర్భంగా పట్టణంలోని పనసతోట ముస్లింయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొని ఉపవాస దీక్షలు విరమించిన ముస్లిం సోదరులకు భోజనం వడ్డించారు.

డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ఈ రంజాన్ మాసం యావత్తూ కఠిన ఉపవాస దీక్షలు ఉండి తమ కోరికలు నెరవేర్చాలని ముస్లిం సోదరులు అల్లాహ్‌ను ప్రార్థిస్తారని, వారి కోరికలు అల్లాహ్ తప్పక నెరవేర్చాలని ఆకాంక్షించారు. ముస్లింలు పరస్పర స్నేహభావంతో మెలగాలని, ఐకమత్యంతో ఉండాలని కోరారు. ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ పట్టణ నాయకులు షేక్ కరిముల్లా, పనసతోట యూత్ సోదరులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి



ప్రచారం చేస్తున్న నాయకులు

నరసరావుపేట: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారానికి శుక్రవారం విజయవాడ ధర్నాచౌక్‌లో నిర్వహించే సదస్సుకు హాజరై జయప్రదం చేయాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) పల్నాడు జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాదరావు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన కార్మికులు పనిచేసే పలు ప్రదేశాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ప్రకారం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, ఉచిత ఇసుక, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీఇచ్చి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా భవన నిర్మాణ కార్మికుల గురించి మాట్లాడిన దాఖలు లేవన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సంక్షేమ బోర్డు పునః ప్రారంభించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని, ఉచితంగా ఇసుక ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న క్లయిములు పరిష్కరించాలన్నారు. సంక్షేమ బోర్డు నిధులను బోర్డుకి తిరిగి జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరుగు సదస్సులో కార్మికులు పెద్దల సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొమ్ముల సురేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మకు రూ.9.27 లక్షలు ఆదాయం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయానికి హుండీల ద్వారా రూ.9,27,713లు ఆదాయం లభించింది. ఆలయంలో హుండీల లెక్కింపు గురువారం నిర్వహించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.8,26,829లు, అన్నదాన హుండీల ద్వారా రూ.95,884ల ఆదాయం లభించింది. హుండీ లెక్కింపులో పర్యవేక్షకులుగా బండి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఆలయ ఈవో ఎస్. మాధవిదేవి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, విజయదుర్గ మహిళా సేవా భక్త బృందం సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి.. తిరిగి రాలేదు !

యడ్లపాడు: మతిస్థిమితం సరిగ్గా లేని ఓ మహిళ కనిపించకుండా పోయిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మండలంలోని జగ్గాపురం గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన కంభంపాటి ఏసు, సోవమ్మ దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు సంతానం. ఈ నేపథ్యంలో ఈనెల 16వ తేదీ ఉదయం సోవమ్మ ఆసుపత్రికి వెళ్తున్నానంటూ కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కానీ అప్పటి నుంచి తిరిగి రాలేదు. దీంతో యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ వి.బాలకృష్ణ దర్యాప్తులో భాగంగా ఆమె అదేరోజు నరసరావుపేట బస్సు ఎక్కినట్లు గుర్తించారు. బ్లూ కలర్ చీర ధరించి ఉన్న 48 ఏళ్ల సోవమ్మ ఆచూకీ తెలిసిన వారు యడ్లపాడు పోలీస్‌స్టేషన్ సెల్‌నం: 94407 96256కు సమాచారం అందించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

■ బార్ అసోసియేషన్ ఎన్నికలు



ఎన్నికైన సభ్యులను సత్కరిస్తున్న న్యాయవాదులు

వినుకొండ: వినుకొండ బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం జరిగాయి. ఈ ఎన్నికల్లో 103 ఓట్లకు గాను 73 ఓట్లు పోలయ్యాయి. ప్రెసిడెంట్‌గా మీసాల శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్‌గా పి.వి.రమణరెడ్డి, సెక్రటరీగా పఠాన్ గౌస్ మొహిద్దీన్‌ఖాన్, జాయింట్ సెక్రటరీగా నీలం శేఖర్‌బాబు, ట్రెజరర్‌గా వరగాని శివశంకర్‌బాబు ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులను న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు.

■ జాతీయ క్యారమ్స్ పోటీల్లో ప్రతిభ

నరసరావుపేట రూరల్: జాతీయస్థాయి క్యారమ్స్ పోటీలలో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని ప్రతిభ కనబర్చినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. కళాశాలలో సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బి.నవ్య రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ందని తెలిపారు. న్యూఢిల్లీలో ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు జరిగిన 52వ క్యారమ్స్ నేషనల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించినట్టు వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నవ్యను కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్ఎన్ తిరుమలరావు, వ్యాయామ అధ్యాపకులు ఎల్.కృష్ణారెడ్డి, యస్.ఆంజనేయులు, పి.విజయకుమార్‌లు అభినందనలు తెలిపారు.

■ నైపుణ్య శిక్షణ కోసం దరఖాస్తులు

నూజెండ్ల: మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్య శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకోవాలని జె.సి.వో శ్రీలక్ష్మీ గురువారం తెలిపారు. ఈసందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ 18 నుంచి 35 సంవత్సరాలలోపు పదో తరగతి ఆపై చదివిన యువతీ యువకులు ఆసక్తి కల్గియున్న కోర్సులలో మూడు నెలల శిక్షణతో పాటు ఉచిత భోజన వసతి సౌకర్యం అందించటం జరుగుతుందన్నారు. ఉపాధి పథకంలో జాబ్‌కార్డు ఉన్న వంద రోజులు పనిదినాలు పూర్తి చేసిన తల్లిదండ్రుల పిల్లలు అర్హులన్నారు. అలాగే శిక్షణ తర్వాత నూరుశాతం ఉపాధి అవకాశాలు ప్రభుత్వం కల్పించుతుందన్నారు. అనంతరం ఎంపీపీ మేడం జయరాంరెడ్డి క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను విడుదల చేశారు. మరిన్ని వివరాలు కోసం సెల్‌నంబరు 7288059665 సంప్రదించాలన్నారు.

■ హెల్త్‌కేర్‌లో ఉద్యోగాలకు ఎంపిక

నరసరావుపేట రూరల్: నిస్స్ కళాశాలలో ప్రముఖ ఫార్మా కంపెనీ ఇండియన్ హెల్త్‌కేర్ బీపీవో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 53మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జేఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. కళాశాలలో గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో విద్యార్థులకు కంపెనీ ప్రతినిధులు వ్రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు తెలిపారు. మెడికల్ కోడింగ్‌కు 13మంది, మెడికల్ బిల్లింగ్‌కు 40మంది ఎంపికైయ్యారని వివరించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్, ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్‌కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ కె.వెంకటగోపయ్య, మయ్.కస్తూరిలు అభినందించారు.

■ ఎలుకలమందు తిని వ్యక్తి ఆత్మహత్య

నాదెండ్ల: ఒకపక్క అప్పుల బాధ, మరోపక్క భార్య దూరమైందన్న మనస్తాపంతో ఎలుకలమందు తిని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గణపవరం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గణపవరం గ్రామానికి చెందిన జెట్టి అరుణ్‌కుమార్ (23) మూడేళ్ళ క్రితం ఒంగోలుకు చెందిన మర్రి శ్రావణితో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు. కుమారుడు పుట్టిన కొద్దిరోజులకే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో భార్య శ్రావణి కొద్దిరోజుల క్రితం పుట్టింటికి వెళ్ళింది. అప్పటి నుంచి అరుణ్‌కుమార్ కొద్దిరోజులు ఆటో నడపగా, తర్వాత నూడిల్స్ బండి నిర్వహిస్తున్నాడు. వ్యాపారాలు సరిగా సాగకపోవటంతో అప్పుల పాలయ్యాడు. దీంతో మద్యానికి బానిసై ఈ నెల 18న మద్యంలో ఎలుకల మందు కలుపుకుని తాగాడు. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందగా, గురువారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. మృతుడి సోదరుడు శివశంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

■ పోలవరంలో అవినీతిపై సీబీఐ విచారణేదీ?

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): పోలవరం ప్రాజెక్టులో అవినీతిపై సీబీఐ విచారణ ఏదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతా మోహన్ ప్రశ్నించారు. గుంటూరు నగరం బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో చంద్రబాబులో ఆవేదన కనిపించిందన్నారు. రాష్ట్రంలో పోలవరం డయాఫ్రమ్ వాల్, కాపర్ డ్యాం పరిశీలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లారని, పోలవరం ఏటీఎంలా మారిందని ప్రధాని గతంలో చెప్పారన్నారు. దీనిపై విచారణ ఎందుకు వేయలేకపోతున్నారని ప్రశ్నించారు. బీటెక్ పాసైన వారు కూలి పనులకు, ఎంబీఏ పాసైన వారు డ్రైవర్లుగా వెళ్తున్నారని వాపోయారు. రాష్ట్రంలో ఉద్యోగాలు ఎక్కడున్నాయని ప్రశ్నించారు.

ప్రశాంతంగా ఉప సర్పంచ్ ఎన్నికలు



ఉపసర్పంచ్ గంటా కోటేశ్వరరావుకు డిక్లరేషన్ పత్రం అందజేస్తున్న డీఇ హరనాథ్



ఉప సర్పంచ్ నియమాక పత్రాన్ని అందుకుంటున్న మద్దినేని ఆంజనేయులు

- గ్రామ పంచాయితీలలో ఐదు ఏకగ్రీవం
- కోరంలేక తురుమెళ్ళ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా

రొంపిచర్ల: మండలంలో ఆరు గ్రామాలలో గురువారం ఉపసర్పంచ్ పదవులకు అధికారులు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాటుచేయగా ఐదు ఉపసర్పంచ్ పదవులకు అభ్యర్థుల ఎన్నిక పూర్తిచేశారు. కొత్తపల్లి, వడ్లమూడివారిపాలెం, అలవాల, అచ్చయ్యపాలెం, అన్నవరప్పాడు గ్రామాల ఉపసర్పంచ్ ఎన్నికలు పూర్తికాగా, తురుమెళ్ళ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడింది. వార్డు మెంబర్లు తక్కువగా హాజరు కావడం వలన కోరం లేక వాయిదా వేయడం జరిగిందని ఎన్నికల అధికారి, మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ లక్ష్మీ కుమారి తెలిపారు. మండలంలో వడ్లమూడివారి పాలెం గ్రామ ఉపసర్పంచ్‌గా వడ్లమూడి రాంబాబు, కొత్తపల్లి గ్రామ ఉపసర్పంచ్‌గా గంటా కోటేశ్వరరావు, అలవాల గ్రామ ఉపసర్పంచ్‌గా పాపసాని వరలక్ష్మీ, అచ్చయ్యపాలెం గ్రామ ఉప సర్పంచ్‌గా గాడిపర్తి సత్యనారాయణ, అన్నవరప్పాడు గ్రామ ఉపసర్పంచ్‌గా గోపు వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపసర్పంచ్‌లుగా ఎన్నికై న వారికి ఎన్నికల అధికార్లు డిక్లరేషన్ ఫారాలు అందజేశారు. కొత్తపల్లి గ్రామ ఉపసర్పంచ్ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా పంచాయతీరాజ్ డీఇ కె.హరనాథ్, అలవాల గ్రామ ఉపసర్పంచ్ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామాంజనేయరెడ్డి, అచ్చయ్యపాలెంకు ఎన్నికల అధికారిగా ఎంఇఓ డి.బ్రహ్మేశ్వరరావు, వడ్లమూడివారిపాలెం గ్రామ ఉపసర్పంచ్ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఎంఇఓ పి.హవేల, అన్నవరప్పాడు గ్రామ ఉపసర్పంచ్ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా మండల వ్యవసాయ శాఖ అధికారిణి పి.శివలలిత వ్యవహరించారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఉప సర్పంచ్‌కు నియమాక ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి అల్లాభక్షు

ఉత్కంఠభరితంగా సాగిన గుంటుపాలెం ఉప సర్పంచ్ ఎన్నిక

శావల్యాపురం: మండలంలోని గుంటుపాలెం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక ఉత్కంఠభరితంగా గురువారం చోటుచేసుకుంది. గ్రామసచివాలయలో జరిగిన ఉప సర్పంచ్ ఎన్నిక అధికార పార్టీ నేతల మధ్య భిన్నమైన అభిప్రాయాలు రావటంతో గందరగోళం నెలకొంది. ఎట్టకేలకు మండల నాయకులు రంగ ప్రవేశం చేసి చర్చలు జరిపి ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా సహకరించారు. గ్రామానికి చెందిన 7వ వార్డు సభ్యుడు మద్దినేని ఆంజనేయులు ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు, శావల్యాపురం ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి మండల పంచాయతీ విస్తరణాధికారి పి.సుగుణ చేతుల మీదగా ఉప సర్పంచ్‌గా ఎన్నికాబడిన మద్దినేని ఆంజనేయులు ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు గ్రామసచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జంగాలపల్లి ఉపసర్పంచ్‌గా రామకృష్ణ నియమాకం

నూజెండ్ల: మండలంలోని జంగాలపల్లి గ్రామ ఉప సర్పంచ్‌గా సోమనబోయిన రామకృష్ణను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు జరిగిన ఉప సర్పంచ్ ఎన్నికకు ఎన్నికల అధికారిగా అల్లాభక్షు వ్యవరించారు. ఉప సర్పంచ్‌గా ఎన్నికైన రామకృష్ణను సర్పంచ్ కూచిపూడి చిన వెంకటేశ్వర్లు,వార్డు సభ్యులు ఘనంగా సత్కరించారు.

అధికారులు.. ప్రొటోకాల్ నిబంధనలు పాటించాలి

- బొల్లాపల్లి ఎంపీపీ రాములు
- సమస్యలు పరిష్కరించడంలో చిత్తశుద్ధి చూపండి



మాట్లాడుతున్న ఎంపీపీ

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బత్తి రాములు అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. తొలుత సర్వసభ్య సమావేశంలో ఆయా శాఖలకు చెందిన అధికారులు తమ శాఖలకు సంబంధించి చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. సమావేశంలో పలువురు సభ్యులు మండలంలో నెలకొన్న ఏరులై పారుతున్న మద్యం, తాగునీరు, విద్య, ప్రొటోకాల్ నిబంధనల సమస్యలపై సమావేశంలో గళమెత్తారు. గ్రామాల్లో మంచినీరు కంటే మద్యం ఏరులై పారుతుందని, ఇష్టానుసారంగా బెల్టుషాపులు వెలిశాయని, మహిళలు అవసరమైన పని నిమిత్తం వీధుల్లోకి రావాలంటే భయాందోళనకు గురవుతున్నారని రావులాపురం సర్పంచ్ ఎ.పున్నారెడ్డి సమావేశం దృష్టికి తెచ్చారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని, వేసవిలో తీవ్ర రూపం దాల్చే పరిస్థితి నెలకొందని జయంతిరామా పురం, అయ్యన్నపాలెం, మర్రిపాలెం, గుమ్మనంపాడు, మేకలదిన్నె పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ గ్రామాల్లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని సమావేశంలో మాట్లాడారు. గుమ్మనంపాడు జడ్పీ హైస్కూల్లో 300 మంది విద్యార్థులకు ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారని అధికారుల దృష్టికి తెచ్చారు.

కాకతీయ అన్నదాన సత్రానికి విరాళాల వెల్లువ



చెక్కును అందజేస్తున్న నరసయ్య దంపతులు

శావల్యాపురం: కాకతీయ అన్నదాన సత్రానికి దాతలు విరాళాలు అందజేస్తున్నట్లు కాకతీయ అన్నదాన సత్రం వ్యవస్థాపక కమిటీ సభ్యులు నాగుబడి వీరనారాయణ గురువారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలోని మతుకుమల్లి గ్రామానికి చెందిన ఆలూరి వెంకట నరసయ్య-నాగేశ్వరమ్మ దంపతులు వారి మిత్ర బృందం సభ్యులు గటిగంటి మురళీకృష్ణ, బోళ్ళ రవిప్రసాదు, మందపాటి సురేష్‌బాబులు ఐక్యంగా తమ వంతు సహాయంగా 40.116 రూపాయాలు అందజేశారన్నారు. కారుమంచి గ్రామానికి చెందిన చుండూరి వెంకట్రావు- లక్ష్మీజ్యోతి ,పోట్లూరు గ్రామానికి చెందిన యలవర్తి వీరాంజినేయులు-శివపార్వతి దంపతులు ఇరువురు కలిపి రూ.25.116 రూపాయాలు వితరణ చేశారన్నారు.చినకంచర్ల గ్రామానికి చెందిన దావులూరి శ్రీనివాసరావు (బ్రిటీష్) -సుబ్బాయమ్మ దంపతులు రూ.15.116 రూపాయలు అన్నదాన నిమిత్తం అందజేశారన్నారు. మతుకుమల్లి గ్రామానికి చెందిన చింతా రమణారావు-శ్వేత దంపతులు రూ.20.116లు, మల్నీడి కర్ణుడు (బుజ్జి) -లక్ష్మీ దంపతులు రూ.15,116 రూపాయలు అన్నదానానికి అందజేశారన్నారు. మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న ఈనెల 30న జరగనున్న శ్రీఅడవి పేరంటాళ్లమ్మ అమ్మవారి తిరునాళ్ల వేడుకలకు విచ్చేయుచున్న అన్నదాన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

తిరునాళ్లల్లో మైకులు నిషేధం

శావల్యాపురం: శ్రీఅడవి పేరంటాళ్లమ్మ తిరునాళ్ల వేడుకలు ప్రశాంతమైన వాతావరణంలో జరగటానికి అందరు సహకరించాలని వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న అడవి పేరంటాళ్లమ్మ అమ్మవారి తిరునాళ్ల జరిగే ఏరియాను పరిశీలించారు. ఈసందర్భంగా రూరల్ సీఐ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ తిరునాళ్లలో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయు నిర్వాహకులు మైకులు అనుమతి నిషేధమన్నారు. తిరునాళ్లకు విచ్చేసే భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండటానికి ఇష్టానుసారంగా మైకులు ఏర్పాటు చేయటం ద్వారా శబ్ద కాలుష్యం నియంత్రణ చేయటానికి ప్రభల నిర్వాహకులు సౌండు బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు. తిరునాళ్లలో ట్రాఫిక్ ఆంక్షలు విధించామన్నారు.

• పీ4 సర్వేపై సమీక్ష

వినుకొండ: తహసీల్దారు కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వం వారు చేపట్టిన పీ 4 సర్వే, వర్క్ ఫ్రం హోం సర్వే, ప్రజలకు నిత్యావసర సరుకుల పంపిణీ, రీ సర్వే, ప్రజలకు రెవెన్యూ సేవలు అందించుట, ఇతర రెవెన్యూ అంశముల పై తహసీల్దార్ వివరించారు.